సర్వర్ బిజీబిజీ!

- మొరాయిస్తున్న రాజీవ్ యువ వికాస పోర్టల్
- దరఖాస్తు చేసుకోని నిరుద్యోగులు
- రెండు రోజులుగా పనిచేయని కంప్యూటర్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న జనం
- గడువు పెంచాలని వేడుకోలు



ఆన్‌లైన్ సెంటర్ల వద్ద జనం నిరీక్షణ

దుద్యాల్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన పథకం రాజీవ్ యువ వికాసం. దీనికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుయస్ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు ఉపాధికల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చింది. బ్యాంకు అనుసంధానంతో కనిష్టంగా రూ.50,000ల నుంచి గరిష్టంగా రూ. 4,00,000ల వరకు అందించనుంది. అందుకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన గైడ్‌లైన్స్ ప్రవేశపెట్టింది. ఇందుకు గాను ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని మార్చి 17 నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 14 వరకు దరఖాస్తులకు చివరి గడువు. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఈ పథకం గురించి పెద్ద ఎత్తున ప్రచారం మొదలైంది. దీంతో అర్హత ఉన్నా, లేకున్నా, నిరుద్యోగులు పోటీ పడుతున్నారు. ఇందుకుగాను కులం, ఆదాయం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, పాన్ కార్డు, ఫొటో అవసరం. కులం, ఆదాయ ధ్రువపత్రాలు లేనివారు చాలా మంది తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగి సంబంధిత పత్రాలు తెచ్చుకుంటున్నారు. అన్ని పత్రాలు సిద్ధం చేసుకున్నకా అప్లికేషన్ చేసుకుందామని నెట్ సెంటర్లకు వేళ్లే జనాలకు చేదు అనుభవం ఎదురవుతుంది. రాజీవ్ యువ వికాసానికి సంబంధించిన పోర్టల్, అందుకు సంబంధించిన సర్వర్ బిజీ..బిజీగా ఉండడంతో నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేసేదేమీ లేక దరఖాస్తు దారులు వేచి చూసి వెనుదిరుగుతున్నారు. అప్లికేషన్ చేసుకోవడానికి చివరి తేదీ ఈ నెల 14 వరకు ఉండడంతో 10వ తేదీ నుంచే సర్వర్ పూర్తిగా బిజీగా చూపిస్తుంది. ప్రభుత్వం అమలు చేసే పథకాలను దరఖాస్తు చేసుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆలోచించి దరఖాస్తునకు మళ్లీ గడువు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

75 రకాల వ్యాపారాలకు..

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వం 75 రకాల వ్యాపారాలకు సంబంధించిన ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవచ్చని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుయస్ వర్గాలలో ఒక్కో వర్గానికి కొన్ని ప్రత్యేకమైన వ్యాపారాలు చేసుకోవచ్చని తెలిపింది. అందులో పశువుల పెంపకం, వ్యవసాయానికి సంబంధించిన పరికరాలు, వాహనాలు, జనరల్ స్టోర్‌లు, ఎలక్ట్రికల్ వస్తువుల దుకణాలు, ఇంటర్‌నెట్ షాప్‌లు, కుట్టు మిషన్లు వంటి వాటికి అవకాశం కల్పించింది.

గడువు పెంచాలి..



రెండు రోజులుగా అప్లికేషన్ చేసుకుందామంటే సర్వర్ బిజీతో చేసుకోలేకపోతున్నాం. చాలా మంది ఇంకా దరఖాస్తు చేసుకోలేదు. ప్రభుత్వం ఆలోచించి గడువు పెంచాలి. లేదంటే చాలా మంది నిరాశకు గురయ్యే అవకాశం ఉంది. చాలా సంవత్సరాల తరువాత ప్రభుత్వం బ్యాంకు అనుసంధానంతో రుణ సాకర్యానికి అవకాశం కల్పించింది. అందుకు గాను చాలా మంది అప్లికేషన్ చేసుకోవడానికి ముందుకు వచ్చారు. ప్రభుత్వం పునరాలోచించి దరఖాస్తు గడువు పెంచితే బాగుంటుంది.

– బల్మూర్‌గొండ సాయి, కుదరుమల్ల

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



ధ్వజస్తంభ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని గొన్యనాయక్‌తండా గ్రామ పంచాయతీకి అనుబంధ తండాగా ఉన్న బధ్యానాయక్ తండాలో శ్రీ అభయ ఆంజనేయస్వామి ధ్వజస్తంభ, శివాలయంలో నందీశ్వరుడు, గణపతి, నవగ్రహ, నాగదేవత విగ్రహాలను ప్రతిష్ఠించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొప్పుల వెంకటనాగిరెడ్డితో హాజరై మహేశ్‌రెడ్డి మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలు భక్తిభావంతో మెలగాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటనాగిరెడ్డితో పాటు మండల నేతలకు తండా వాసులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, మోత్కూర్ మాజీ ఉపసర్పంచ్ కరణం శ్రీకాంత్‌రావు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



చెక్కు అందిస్తున్న భీంరెడ్డి

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: పేదలకు అండగా కాంగ్రెస్ నిలుస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలో తిర్మలాపూర్ గ్రామానికి చెందిన వార్ల నర్సింలుకు రూ.60వేలు, కుల్కచర్ల గ్రామానికి చెందిన కాటని అంజిలయ్యకు రూ.20వేలు, వార్వాల అంజికి రూ. 28వేల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం సహాయనిధి పేదలకు వరమని పేర్కొన్నారు. కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్ ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తమ్మలి రాంచంద్రయ్య, లింగంగారి రాములు, చంద్రభూపాల్, అడ్వకేట్ నర్సింలు, చంద్రయ్య, బాలకృష్ణ, భాస్కర్, కృష్ణయ్య, షర్ఫొద్దీన్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో సన్న బియ్యం వండుకోవాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి



అల్లిఖాన్‌పల్లిలో పంపిణీ చేస్తున్న నాయకులు

దుద్యాల్: ప్రతి ఇంట్లో సన్న బియ్యంతో అన్నం తినాలని ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అల్లిఖాన్‌పల్లి గ్రామంలో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సన్న బియ్యంతో అన్నం తినాలంటే పెద్ద రైతు, ఆర్థిక స్థోమత ఉన్న వారి కుటుంబాల్లోనే ఉండేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వం అని సీఎం రేవంత్ రెడ్డి మరో మారు నిరూపించారని గుర్తు చేశారు. సన్న బియ్యం అమ్ముకోవడం వంటి పనులు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మేరుగు వెంకటయ్య, నాయకులు ఖాజా, శ్రీశైలం గౌడ్, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి



అంబేడ్కర్ జయంతికి హాజరుకావాలని ఎమ్మెల్యే బీఎమ్మార్‌ను ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

అంబేడ్కర్ జయంతి కమిటీ

తాండూరు టౌన్: ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని తాండూరు డివిజన్ అంబేడ్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కె శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని కమిటీ సభ్యులు కలిసి ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడని కొనియాడారు. కులం, మతం పేరుతో కొన్ని రాజకీయ శక్తులు భారత రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని, వారిని అడ్డుకుని తీరుతామన్నారు. అనంతరం అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కమిటీ ప్రతినిధులు రాములు, ఆశన్న, బుగ్గప్ప, నర్సిములు, అబ్దుల్ వాహబ్, చంద్రయ్య, మల్లికార్జున్, ప్రకాశ్, వెంకటేశ్, ఆనంద్ తదితరులు ఎమ్మెల్యేను ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

క్లుప్తంగా

కాళికామాత శకటోత్సవం



కాళమ్మ దేవాలయం చుట్టూ ట్రాక్టర్లతో శకటోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కుల్కచర్ల: మండల కేంద్రంలోని కాళమ్మ దేవాలయంలో ఆలయ ఉత్సవాలు శోభాయమానంగా కొనసాగుతున్నాయి. శనివారం శకటోత్సవం నిర్వహించారు. దీనికి భక్తులు భారీగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమను చల్లంగా చూడాలంటూ మొక్కుకున్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాంచంద్రయ్య, భరత్ కుమార్ రెడ్డి, చంద్రయ్య, భాస్కర్, కృష్ణయ్య, శివానందు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కొడంగల్ రూరల్: మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శనివారం మిషన్ భగీరథ సంప్‌హౌజ్ ఎదుట దీక్షా శిబిరం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర జిల్లాల్లో కార్మికులకు రూ.15,500లు చెల్లిస్తుండగా తమకు కేవలం రూ. 10,900లు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. ఇతర జిల్లాల్లో కార్మికులకు అందిస్తున్న మాదిరిగానే తమకు కూడా ఇవ్వాలని, కనీస వేతనం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరు నెలల నుంచి ఈపీఎఫ్ జమ చేయడం లేదన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అబ్దులప్ప, హరిప్రసాద్, వెంకటయ్య, ఆదిత్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వసతికి ప్రత్యేక చర్యలు

పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

దోమ: గ్రామంలో తాగునీటి వసతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని గుండాల తండాలో కొంత కాలంగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకొని ప్రత్యేకంగా బోరు మోటార్‌ను బాగుచేయించారు. వాటి ద్వారా ప్రజలకు తాగునీటి సమస్యను తీర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు రానీయొద్దన్నారు. ప్రతీ వార్డులో నూతన బోరు మోటార్లను ఏర్పాటు చేయించి తాగునీటిని అందిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



బొంరాస్‌పేట: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

యాలాల: గ్రామాల అభివృద్ధే లక్ష్యమని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. పగిడియాలలో రూ.20లక్షల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అడిగిన వెంటనే సీసీ రోడ్డుకు నిధులు మంజూరు చేయించారన్నారు. గ్రామంలో అవసరమైన చోటా మరిన్ని సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధుల మంజూరునకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వడ్ల కాలప్ప, రఘురాం రెడ్డి, సంపత్‌కుమార్, మల్లప్ప, రాములు, ప్రభాకర్, చంద్రప్ప, వెంకటయ్య, జాఫర్, శేఖర్, ఎల్లప్ప, రవి, సాయప్ప పాల్గొన్నారు.

రూ.10లక్షలతో సీసీ రోడ్డు..

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రారంభించారు. పల్లెల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, రాంచంద్రారెడ్డి, సంతోష్, కిష్టప్ప, మైనొద్దీన్, నర్సింలు, శేఖర్, కలీం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



కుల్కచర్ల: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కుల్కచర్ల: స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని చౌడాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గసభ్యుడు బంధయ్య పేర్కొన్నారు. 'హర్ గావ్ చలో-హర్ బస్తీ చలో' కార్యక్రమంలో భాగంగా శనివారం వీరాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. బస్తీల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓర్వలేక రాజ్యాంగాన్ని మారుస్తున్నారని బూటకపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనాన్ని సృష్టించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ అత్యధిక మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ధారూరు: వాజ్‌పేయ్ జయంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో శనివారం గావ్ చలో-బస్తీ చలో కార్యక్రమాన్ని నాగసమందర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా దిశ కమిటీ సభ్యుడు, నియోజకవర్గ బీజేపీ కో ఆర్డినేటర్ వడ్లనందు రైతులు, యువతతో మాట్లాడారు. బూత్ కమిటీలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార పార్టీ ప్రతినిధి రాజేందర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మణికంఠరెడ్డి, రవీందర్‌ఔగ్, ప్యాట శంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీజేపీ నాయకులు స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డాక్టర్, సిబ్బంది విధుల నిర్వహణపై ఆరా తీశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్

బంట్వారం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి కోట్‌పల్లి మండలంలోని జిన్నారంలో పోలీస్ కళాజాత బృందం ప్రజలకు పాటలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. ఆన్‌లైన్ గేమింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, బాల్య వివాహాలు, సీసీ కెమెరాలు తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గఫార్

శోభాయమానంగా హనుమాన్ జయంతి

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లలో ఆయా మండలాల్లోని హనుమాన్ దేవాలయాల్లో హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయాల్లో ముందుగా పంచామృతాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు హనుమాన్ చాలీస్ పఠించారు. పూజల అనంతరం దేవాలయా కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో యువకులు, హిందూ సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, పల్లకీ సేవ, రథయాత్ర చేపట్టారు.



కొడంగల్ : పూజలు చేస్తున్న భక్తులు



పరిగి: ప్రత్యేక పూజలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



మోమిన్‌పేట: ఏన్కతలలో రథయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



కొడంగల్ రూరల్: అప్పాయిపల్లిలో స్వామివారి పల్లకీ సేవ



పూడూరులో..



బొంరాస్‌పేట: దేవులానాయక్‌తండాలో..



తాండూరు టౌన్: హనుమాన్ శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి



బంట్వారం: హనుమాన్ దేవాలయం వద్ద పూజలో భక్తులు



దుద్యాల్: హస్నాబాద్ ఆంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు



కుల్కచర్ల: చౌడాపూర్‌లో హిందూ సంఘాల బైక్ ర్యాలీ



తాండూరు టౌన్: హనుమాన్ శోభాయాత్ర

సంక్షిప్త వార్తలు

• ఆర్థిక సాయం అందజేత

కొడంగల్: పట్టణంలోని గాంధీనగర్‌లో రెండు రోజుల క్రితం చనిపోయిన మల్కప్ప కుటుంబానికి యువజన కాంగ్రెస్ జాతీయ సమన్వయకర్త కృష్ణంరాజు ఆర్థిక సాయం అందజేశారు. శనివారం మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడారు. మల్కప్ప చిన్న కుమారుడి చదువు కోసం అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అలాగే గాంధీనగర్‌లోని 12వ వార్డులో శేఖర్ ఇంటి నుంచి దర్బార్ రమేశ్ ఇంటి వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం పైపులను ఇప్పించారు. తన సొంత ఖర్చుతో కూలీలను పెట్టి పైప్ లైన్ నిర్మాణ పనులను చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు, రమేష్‌బాబు, శేఖర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

• నేడు జై భీమ్..జై బాపు..జై సంవిధాన్

యాలాల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జై భీమ్..జై బాపు..జై సంవిధాన్ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడికొండ నర్సిరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు బండమీదిపల్లి నుంచి ప్రారంభించి పగిడిపల్లి, రేళ్లగడ్డతండా, పటేల్‌చింతతండా తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. పటేల్‌చింతతండాలో గిరిజనులతో కలిసి సన్నబియ్యం భోజనం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

• విద్యుత్ సరఫరాలో అంతరాయం

దోమ: దోమ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు మోత్కూర్, దిర్సంపల్లి, గుండాల సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల రైతులకు త్రీఫేస్ విద్యుత్‌లో అంతరాయం కల్గుతుందని విద్యుత్ ఏఈ జి వినయ్‌కాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుట్టపహాడ్ నుంచి ఆయా గ్రామాల్లో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని వినయ్‌కాంత్ కోరారు.

• కనుల పండువగా పూలతోట జాతర

తాండూరు రూరల్: కోత్లాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని మిర్యాణం గ్రామంలో పూలతోట జాతర కనుల పండుగగా నిర్వహించారు. శనివారం ఉదయం వీరభద్రేశ్వరుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేపట్టారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. వీర భద్రేశ్వర స్వామికి జై అంటు నినాదాలు చేశారు. కర్ణాటక-తెలంగాణ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మిర్యాణంలో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు